18. బుద్ధిశాలి

"ఊళ్ళో దొంగల హడావిడి యెక్కువగా వున్నట్టుందే?" అన్నాడు గోపాలం.

"మొన్న మా వీధిలో డాక్టర్‌గారింట్లో మూడువేల రూపాయల విలువగల వస్తువుల్ని దొంగిలించారు" అన్నాడు దాసు.

"ఆ డాబా ఇంట్లో యెలా ప్రవేశించారూ?" అన్నాడు శేషు.

"అదే వాళ్ల చాకచక్యం. ఆ కీలకం తెలుసుకోగలిగిన ప్రతివాడూ దొంగయేందుకే ప్రయత్నిస్తాడు. యెందుకంటే ఆరేసి నెల్లకొక రాత్రి వంతున పనిచేస్తే చాలు!"

"దొంగలంటే జ్ఞాపకం వచ్చింది. మూడేళ్ళ క్రితం ఏలూరులో వుండగా... యెండాకాలం ఆరుబైట పడుకున్నాం. అర్ధరాత్రి ఇంటికప్పులో చప్పుడైతే, బద్ధకంగా వుండికూడా లేచి చూద్దామనుకూంటూండంగా పిల్లివొకటి పైనుంచి దూకింది. వెధవపిల్లిని తిట్టుకుంటూ హాయిగా నిద్రపొయ్యాను. తెల్లారేసరికల్లా కప్పులో అమర్చబడ్డ పెద్ద వెంటిలేటర్ ప్రత్యక్షమైంది. దాని కూలికిగాను వెయ్యిరూపాయల తెలుపూ పసుపూ లోహాలు యిచ్చుకోవాల్సి వొచ్చింది..."

"ఆ మాటకొస్తే... ఐదేళ్లనాడు బాపట్లలో వుంటూండగా బైట జోరుగా గాలీ కుంభవర్షమూను! దొంగ ఎంతసేపట్నించి ఆ గాలివానలో కాపలా కూర్చుని వున్నాడో తెలియదు. మా ఆవిడ దొడ్డితలుపు తెరిచి అవతలికి వెళ్ళి వచ్చేలోపల, వంటింట్లో నుంచి లోన ప్రవేశించి వుంటాడు. ఆమెకు బాగా నిద్రపట్టాక సామాను సర్దటం మొదలుపెట్టాడు. ఖరీదైన చిన్నవస్తువులన్నీ నా లెదర్ సూట్‌కేసులోకి సర్దుకొని, తడిసి ముద్దయిన వాడి బట్టల్ని విడిచేసి, యిస్త్రీ బట్టలు కట్టుకొని మిగిలిందేమన్నా వుంటే

తన తరువాతి వాడికోసం వీలుగా వుండేట్టు వాకిటి తలుపు బార్లగా తెరిచి రంగేళీ రాజల్లే ఉడాయించాడు. మధ్యలో నాకొకసారి మెలుకువ వొచ్చింది కాని లైటు ఆర్పేసి వుండడంవల్ల... బహుశా గాలికి పోయి వుంటుందని ఒత్తిగిలి ఇంకా వెచ్చగా వుండేందుకు రగ్గు పైదాకా లాక్కుని పడుకున్నాను..."

"పోలీసు రిపోర్టు చెయ్యాలా?"

"ఏం లాభం? కేసు రిజిస్టరు చేసుకోవటం వరకే వాళ్ళ సహాయం, తరువాత వస్తువులేమన్నా దొరికితే కేసు. లేకపోతే ఏం లేదు... వాటి వెనుక ఇంకో దొంగ అదే రాత్రి తనకోసం సిద్ధంగా తెరిచివున్న తలుపుల్లోంచి ప్రవేశించకపోవటం కొంత నయమని ఊరటచెందాను..."

"పోలీసులు ఇంత పనికిరాకుండా పొయ్యారేం?"

"మా ఇంట్లో జరిగిన నాలుగోనాడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఇంటికే కన్నం పడ్డది. ఎంత పోయిందో సరిగ్గా తెలియదు. అసలు కేసుకూడా రిపోర్టు కాలేదు. ఎలా అవుతుందీ? వాళ్ళను వాళ్ళు కాపాడుకోలేరు. మననేం కాపాడుతారూ?"

"ఆ వారంలో ఎవరైనా నిమోనియాతో చచ్చాడేమో కనుక్కోక పొయ్యావూ?"

"అది మనకేవిధంగా ఉపయోగిస్తుందీ?"

"దొంగ వానలో గంటల తరబడి వుండి వుంటాడనేదీ, వానలోనే తడుస్తూ వెళ్ళిపొయ్యాడనేదీ స్పష్టం. వాడికి నిమోనియా రాకుండా వుంటుందా?" తన తెలివితేటల్ని చూడమన్నట్టు శేషు ఊపిరి గట్టిగా పీల్చి పొడుగుసాగేందుకు ప్రయత్నించాడు.

"అసలు ఆ దొంగది ఏవూరో ఏమో? వాడి పాత గుడ్డలు వొదిలివెళ్ళాడు, కాని యెడ్రసన్నా వొదిలి వెళ్ళాడా? నిమోనియా తప్పనిసరిగా వొచ్చితీరాలని ఏమిటీ? వొచ్చినా చావాలని ఏముందీ? మంచి డాక్టరుకు ఫీజు ఇచ్చుకోగల పైకం చేతులో వుండగా వాడికేం భయం? అదంతా అలావుంచి నిమోనియో వొచ్చిన ప్రతీరోగి దగ్గరకూ వెళ్ళి యెక్కడ పరీక్షిస్తాం? అదంతా లేనిపోని శ్రమ!"

"ఒకవేళ మనకు మధ్యలో మెలకువ వస్తే మాత్రం ఏం చెయ్యగలం? వాళ్ళు ఏ ఇతర వృత్తికి పనికిరాక యీ వృత్తికి దిగినవాళ్లు. మనకన్న బలవంతులు. జైలన్నా, పోలీసులన్నా, వాళ్ళు పెట్టే యమయాతనలూ బాధలూ లెక్కచెయ్యనివాళ్లు, చివరకు ప్రాణానిక్కూడా తెగించేవుంటారు. వెంట ఆయుధాలుకూడా వుంచుకుంటారు. వాళ్ల పెద్ద యుద్ధానిక్కూడా సిద్ధంగా వున్నవాళ్లాయె! మనం ఏమరపాటున వున్నవాళ్ళం. నిద్రమత్తులో తూలుతూ అప్పుడే లేచి విషయాన్ని అర్థం చేసుకొని మంచిదారి ఆలోచించుకొనే వ్యవధికూడా వుండదు. అసలు లేచేందుకే భయం! ఒక విధంగా

లేవకుండా నిద్ర నటించడమే మంచిది. లేస్తే తనను పట్టుకుంటారనీ, తంతారనీ, జైలుకు పంపుతారనీ వీటన్నిటినుంచీ ఏదోవిధంగా దూసుకుపొయ్యేందుకు ప్రయత్నిస్తూ ఆ తొందర్లో దగ్గరవున్న ఏ కత్తినో ఒక్కవిసురు విసిరికూడా పోతారు. పూర్వం ఒకసారి మా పొరుగింటాయన దొంగను పట్టుకోబోతే వాడు అయన చేతిమీద జన్మంతా గుర్తుండేట్టు బాకుపోటు పొడిచి మరీపొయ్యాడు. పోయిన విలువైన ఆభరణాలకన్నా ఆయన రాబడి ఆ మచ్చే! ఇంకా నయం... ఆ కత్తి ఏ గొంతులోనో పొట్టలోనో దిగబడ్డట్టయితే...?"

అప్పుడు ఏమయ్యేదో వూహించుకోమన్నట్లు ఆగాడు. మరతిప్పిన కుళ్లాయిలా రక్తం బొళబొళా కారేదని చెప్పకపోవటం, చెప్పే విధానంలోని టెక్నిక్.

శేషు అంతా వూహించుకుంటున్నాడు. ఆ కనిపించని దొంగల మీద అతని కోపం మిన్నుముట్టింది. ఇప్పుడే వాళ్లు యెదురైతే ప్రాణానిక్కూడా తెగించి తలబడేందుకు తగినంత శక్తి తనలో సమకూరినట్టు తోచింది.... మధ్యలో మెలుకువ వచ్చికూడా చూసి సహిస్తూ వూరుకొని ఆ దొంగతనాన్ని విజయవంతంగా సాగనివ్వటమే కాక అలాటివి ఇంకా జరిగేందుకు ఒకవిధంగా ప్రోత్సాహాన్ని యివ్వటం– ఆ పిరికితనానికి తనలో తాను నవ్వుకున్నాడు. న్యాయాన్నీ చట్టాన్నీ కాపాడేందుకు– తనైతేనా–యెగిరి వాడిమీదికి దూకేవాడు. జయాపజయాలు దైవాధీనాలు. ఈ లోపల యిరుగుపొరుగు సహాయంకూడా వొస్తుంది. అప్పుడు ఆ దొంగ వెధవను వేపచెట్టు మొదలుకు చేతులు వెనక్కువిరిచి చాంతాళ్ళతో కట్టి శరీరమంతా హూణం హూణం చేసి పోలీసు స్టేషన్‌కు లాక్కువెళ్లేవాడు... అప్పటికే పోట్లాటలో తను అలిసిపోయి వుంటే మిగతా జనమే ఆ పనిచేసేవాళ్లు. మరీ బడిపిల్లకాయలువుంటే మళ్లీ యింకోసారి యింతమంచి ఛాన్సు దొరుకుతుందో దొరకదోనని వాడి ఎముకల్ని కూడా విరగ్గొట్టే సన్నాహాలు చేసేవాళ్లు అప్పుడు తను తీరిగ్గా సిగరెట్టు ముట్టించి యీదృశ్యాన్ని కళ్లారా చూసి ఆనందిస్తూ, నాజూగ్గా పొగను గాలిలోకి వొదులుతూంటాడు. గుమిగూడిన జనంలో ఆడవాళ్లు (పిల్లలూ ముసలివాళ్లూ మినహాయించి) తన యీ అతిధైర్య సాహసకార్యానికి నోటితో పొగడకపోయినా కళ్ళతో మెచ్చుకుంటూంటే ...! ఆ ఆనందమంతా నిజంగా అనుభవిస్తున్నట్టే తోచి, చెక్కటేబిలు విరిగేటంత బలంగా గుద్ది, యెగిరి గంతేసి... తన యెదుట దొంగకు బదులు ఇద్దరు స్నేహితులున్నట్టు ఇప్పుడే తెలుసుకొని నిరుత్సాహంతో కూలబడ్డాడు.

"ఏమిటీ–హిస్టీరియా ఫిట్ కాదు కదూ!"

"శరీరం పైత్యించిందా? డాక్టర్ను పిలవాలా?"

శేషు గట్టిగా నిట్టూర్చి "మీరందరూ పిరికిపందలు! దొంగ యింట్లో ప్రవేశించి, హక్కున్న మీ ఆస్తిని దొంగిలించుకుపోతున్నా గుడ్లు మిటకరించి చూస్తూ

వూరుకున్నారంటే మీ శరీరంలో అసలు ధైర్యమనేది లేదు. పైగా నిద్ర నటించడమే ఒక విధంగా మంచిదని సలహా చెప్పొచ్చారు... అసలు దొంగకు కలిగే భయం యెక్కువై వుండాలి. ఎందుకంటే-వాడిది కల్మషాత్మ. మన ఒక్క కేకకు లోకమంతా (దొంగలు మినహాగా) మన పక్షం వహించి పోట్లాడుతుంది. న్యాయమూ, రక్షణ చట్టమూ, యెర్రబుట్టలూ మనకు యెప్పుడూ తోడునీడగా అందుబాటులో వుంటయ్. ఈ ఆయుధాలన్నీ వుంచుకొని భయపడితే-మన మొగతనం యెంతా?"

"అదంతా నిజమేకాని--వాళ్ళు జీవితాల మీదనే ఆశలు వొదులుకున్న మొండి వెధవలు. డబ్బుపోతే మళ్ళీ సంపాయించుకునే అవకాశం వుంది. కాని ప్రాణం పోతే...?"

"కబుర్లు చెప్పకు... అదే నేనైతేనా?-" అని తనైతే నిజంగా యేం చేసేవాడో ప్రత్యక్షంగా చూపేందుకు తగిన పరికరాలేమీ లేకపోవటమూ, పరిస్థితి ఊహాగానమే కనుక తగిన ఉద్రేకం వెంటనే కలగక పోవటమూ గమనించి, తన ప్రతాపాన్ని శబ్దమయేట్టు పళ్ళు పటపటా కొరకడంతో సూచించాడు.

2

రాత్రి భోంచేసినప్పట్నుంచీ ఆలోచిస్తున్నాడు. దొంగల గొడవ ఒక్కటే అతని బుర్రలో పనిచేస్తూవుంది. కిటికీదగ్గర నిలబడి బైటికి చూస్తూవుంటే ఆ కటిక చీకట్లోంచి నిజంగా దొంగ వస్తూన్నట్టే తోచింది. వెంటనే బ్యాటరీలైటు వేసి చూశాడు. ఒత్తుగా పెరిగిన మొక్కలు గాలికి తలలాడిస్తూండడం తప్ప యింకేమీ కనిపించలేదు. ఆ మొక్కలచాటున దొంగ దాక్కొనివుంటే- కనుక్కోవటం చాలా కష్టం. వెధవ మొక్కలు! వాసనలేని పూలనూ, పనికిరాని పళ్లనూ కాచేందుకూ, దొంగ వెధవల్ని ప్రమాదాల్నించి కాపాడేందుకూ, భూసారాన్ని పీల్చేందుకూ తప్ప ఇంకెందుకూ పనికిరావు. రేపే వీటన్నింటినీ పీకించి పెంటపోగులో వేయించాలని నిశ్చయించుకున్నాడు.

ఇంటిచుట్టూవున్న కాంపౌండ్ గోడను పరిశీలించి చూశాడు. ఏమంత యెత్తుగా వుందీ? కుక్కల్నీ, పందుల్నీ, మేకల్నీ- యింకా యిలాటి జంతుజాలాన్నుంచి కాపాడేందుకు మాత్రం యేవిధంగానూ పనికిరాదు. తండ్రి పోతూపోతూ దొంగలకు అలివికాకుండా వుండేట్టు కోట గోడంత యెత్తున కట్టించివున్నట్టయితే తనకీ మనోబాధ వుండకపోను. ఐనా ఎంత యెత్తుంటే మాత్రం వాళ్ళు రాలేకపోతారా? కొంతవరకూ కాపాడుతుంది కాని... అసలు కాంపౌండ్ గోడలులేని ఇళ్లల్లోనూ, పూరి పాకల్లోనూ, తలుపులూ, దర్వాజాలు కూడా లేని ఇళ్లజోలికి దొంగలుపోరు. ఎందుకంటే లోపల యేం దొరుకుతుందో వాళ్లు బైటనుంచే గ్రహించగలరు. తొందరపడి వెళ్తే-యింకోచోట కష్టపడి మూటకట్టిన దొంగసొత్తును పొరపాటున కానీ, లేక ఇంటివాళ్లు హఠాత్తుగా

లేచి అరిచే అరుపులకు కానీ – ఆ ఇంట్లోనే మరిచిపోయో, వొదిలిపెట్టో రావొచ్చు కూడాను. అందుకనే పైన చెప్పిన రకం ఇళ్లల్లో నివసించే వ్యక్తులకు యీ దొంగలబాధ వుండదు. మనోచింత లేకుండా హాయిగా నిద్రపోతారు. ఏ ఇంట్లో ప్రవేశించినా రిస్క్ ఒక్కటే! ఐశ్వర్యవంతుల ఇళ్లల్లో జొరబడ్డందుకు ఒక రకం శిక్షా, బీదవాళ్ల ఇళ్లల్లో జొరబడ్డందుకు ఒక రకం శిక్షా లేవుగా! అందుకని కాస్త గిట్టుబాటుకుకూడా కనిపెట్టి పోతూంటారు.

చెక్కు చెదిరేందుకు వీల్లేకుండా సిమెంటుతో పెద్ద భోషాణాలకుమల్లే కట్టిన డాబాలూ, మేడలజనం– వాళ్ళక్కూడా యీ భయం తక్కువే! నెలజీతాల మీద కాపలావాళ్లను కూడా పెట్టుకుంటారు. కనుక హాయిగా నిద్రపోగలరు. పోతే తనలాటి మధ్యతరగతి కుటుంబీకులు ఎటూకాకుండా వేళ్లాడాల్సిందే! తనయింటికి తనే వేరే జీతమేమీ లేని కాపలావాడు.

భార్య భోజనం పూర్తిచేసివొచ్చి "గాలి లేదు. బైట పడుకుందాం" అంది.

బైట పడుకునేందుకు శేషుకు భయంగా వుంది. మరీ ఆ దొంగల మొండిహృదయాల్నీ, తెగింపునూ అన్నిటికన్నా వాళ్లు చేబట్టే ప్రాణాపాయకరమైన ఆయుధాల్నీ తలుచుకున్నకొద్దీ అతని మనస్సు ధైర్యపు శిఖరాలనుంచి బరబరా దిగజారనారంభించింది. ఇదంతా బైటపెట్టకుండా (తన పురుషత్వానికి హాని కలిగేందుకు వీల్లేదుగా మరి... అందులోనూ భార్య ముందు!) "ఇక్కడ కిటికీలోంచి గాలి బాగా వొస్తుంది. మళ్ళీ వాన వొస్తే ఇవన్నీ లోపలకి జేరెయ్యలేం... ఆకాశంవైపు చూడు... మబ్బుయెలా పట్టిందో!" అన్నాడు.

"అమావాస్యనాడు చీకటిగా వుండదా యేం? మేఘాలు యెక్కడ వున్నయ్? నక్షత్రాలు బాగామెరుస్తూ వుంటే–?"

"దొడ్లోవొద్దులేవే!" అన్నాడు. కారణాలేమీ లేకపోవటంవల్లా, ఉన్నా బైటపెట్టేవి కాకపోవటంవల్లా– ఒక విధంగా కంఠస్వరాన్ని బతిమాలుతూన్నట్టుగా తగ్గించి.

"ఇంట్లో మాత్రం నేను పడుకోలేను. నా ఒళ్లంతా పేలింది."

"ఫరవాలేదు..."

"ఏమో బాబూ! మీకు నచ్చచెప్పలేను. నేను మాత్రం లోపల పడుకోలేను. కావాలంటే మీరు ఇంట్లోనే పడుకోండి."

ఇది ఆమె నిశ్చితాభిప్రాయమని తేలిపోయింది. శేషుకు యెదిరించే శక్తి లేదు. అందులోనూ అకారణంగా! తను ఒక్కడూ యింట్లో పడుకోవడాన్ని గూర్చి యెక్కువగా ఆలోచించాల్సిన పనిలేదు. భార్యను ఒంటరిగా దొడ్లో పడుకోనిస్తే– నిజంగా ఆ

దొంగవొస్తే అబలను కాపాడేందుకు, సబలుడైన తను- భర్తరూపంలోని సర్వరక్షకుడు యెంతైనా అవసరం!... అందుకనే మరేమీ వాదప్రతివాదాలు జరక్కుండానే రెండు మంచాలూ దొడ్లోకి వెళ్లినయ్.

ఆమెకు వెంటనే నిద్రపట్టింది. శేషుకు నిద్ర రావటంలేదు సరికదా దొంగల్ని గూర్చిన ఆలోచనలతో బుర్ర వేడెక్కుతూ వుంది. దాంతోపాటే కాస్తో కూస్తో మిగిలివున్న అతని ధైర్యంకూడా ఒక పక్కనుంచి చల్లబడుతూ వుంది. తప్పనిసరిగా పోట్లాడాల్సి వొస్తుందేమో - ఆ క్షణంలో కూడా తను యెందుకూ పనికిరాకుండా పిరికి పడిపొయ్యేట్టున్నాడు. తెగింపుతో కూడిన వాళ్ల బలం ముందు తనెంతా?- అసలు ఒంటరిగా ఈ విషయాల్ని గూర్చి ఆలోచించేందుకే భయంగా వుంటే?

శేషు దృష్టి చప్పున పక్క మంచంమీద పడుకొన్న భార్యవైపూ-ఆమె మెడలోని బంగారు గొలుసువైపూ మళ్లింది. ఇంత విలువైన ఆభరణాల్ని కూడా ధరించి ఆరుబయట పడుకుంటే - యెంత ప్రమాదం! లేని ఒక ప్రమాదాన్ని కొనితెచ్చు కోవటంలాటిది.

భార్యను లేపుతూ "ఇదుగో ! ఆ గొలుసు ఇంట్లో పెట్టిరా-" అన్నాడు.

"ఎందుకూ? అది మిమ్మేంచేసింది?" అందామె నిద్రమత్తులో.

"రాత్రిళ్లు నీ అందం యెవరు చూస్తారేం? చెప్తూ వుంటే?"

"నేను లేచి ఆ తాళాలన్నీ తియ్యలేను" అని ఆమె ముడుచుకొని పడుకుంది.

శేషుకు బాగా కోపం వచ్చిందికాని- ఆ కోపాన్ని భరించాల్సిన వ్యక్తి నిద్రావస్థలో ఉండటంవల్ల, ఏ కారణాల మీద తనకీ కోపంవొచ్చిందో ఆ కారణాల్ని బైటపెట్టలేని అశక్తత వల్లా మాట్లాడలేకపొయ్యాడు.

ఐనా యింట్లో యింకా విలువైన వస్తువులు కూడా ఉన్నయ్. వాటితో పాటు యీ గొలుసుకూడా ఇంట్లోనే వుంటే- తామిల్లా యీ చల్లగాలికి మైమరచి నిద్రపోతే- అటువైపునుంచి దొంగ ఇంట్లో ప్రవేశించే అవకాశమూ వుంది. ఇతర వస్తువులతో పాటు యీ గొలుసుకూడా వాడికి అందివ్వటం అవుతుంది. ఈ గొలుసు యిక్కడే ఉండటం ఒకందుకు మంచిదే ! కాని తను ఈ రాత్రి ఇంటాబైటా కూడా కాపలా కాయాల్సివొచ్చింది.

తాలూకాలో ఒంటిగంట కొట్టారు. దొడ్లో చెట్ల చాటున చప్పుడైంది... శేషు ఊపిరి బిగబట్టి ఒక్క క్షణం ఊరుకున్నాడు. ఒక్కడూ లేచి వెళ్ళి చూసేందుకు భయం. భార్యను లేపుతూ- నిజానికి అక్కడేమీ లేకపోతే తన తెలివితక్కువా, పిరికితనమూ బైటపడిపోతయ్... ఎలాగో ధైర్యంచేసి బ్యాటరీలైటు వేసి చూశాడు. సజీవమానవ

ప్రాణి యేదీ అక్కడ లేదని నిశ్చయంగా గ్రహించాక కాని అతని కాలు ముందుకు సాగలేదు. తను అనుమానించిన ప్రదేశాన్ని సమీపిస్తున్నకొద్దీ- తెలిసివుండీ అగ్ని గుండంలోకి పోతూన్నట్టనిపించింది... పందికొక్కొకటి చరచరా దూసుకుపోవటాన్ని చూశాకకాని, అతని గుండెదడ తగ్గలేదు. వెధవ దొడ్డి! ఒక ఫుట్‌బాల్ గ్రౌండు, ఒక టెన్నిసుకోర్టూ పట్టేటంత ప్రదేశం! ఇంత విస్తీర్ణాన్ని ఒక్కడూ కాపలాకాయటం మాటలా?

పడుకున్నాడన్నమాటే కాని మళ్ళీ అవే ఆలోచనలు! ప్రతిరాత్రీ యీ దొంగల ఆలోచనలు రాకపోవటం వల్ల భయంతో ఛస్తూ యిలా మేకులాగా కూర్చొని కాపలా కాయాల్సిన ఇబ్బంది వుండేది కాదు. సాయింత్రం ఆ దొంగల ప్రస్తావన క్లబ్బులో రావటమూ, అది అదేపనిగా తన తలలో తందనాలాడటమూ మరీ ఘోరంగా వుంది. ఇంత ఆలోచించాక, దొంగ ఒకడు యీరాత్రి తప్పకుండా తన యింటికి పిలుపులేని అతిథల్లే వొచ్చి తీరుతాడనీ, వాడికి సరైన స్వాగతం యివ్వాల్సి వొస్తుందనీ, అందుకని రాత్రంతా మేలుకొని వుండక తప్పదనీ నిశ్చయించుకున్నాడు. ఐతే ఆ వొచ్చే అతిథి యెవరో తనకు తెలియదు. వాడు బాగా కనిపించాలంటే యీ చీకటిరాత్రికి లైటు అవసరం. లాంతరు మరీ చిన్నదిచేస్తే ఆ కాస్తా గాలికి అరిపోతుందేమోనని, కాస్త పెద్దదిగానే వుంచి, యెత్తుగా వున్న తులసికోట మీద పెట్టి ఆ పరిసరాలు బాగా కనిపిస్తున్నయ్యా లేదా అని చూసి తృప్తిపడ్డాక మళ్ళీ మంచంమీద వాలాడు. తనిలా నిద్రమేలుకోవటం నిజంగా బుద్ధిమంతుల లక్షణం. ఎందుకంటే అసలు ప్రమాదాన్ని ఎదుర్కోవటంకన్నా (ప్రమాదమని దృఢంగా తెలుసుకొని కూడా !) ప్రమాదమే రాకుండా దూసుకుపోవటం – కనీసం అందుకు ప్రయత్నించటం వెయ్యి రెట్లు మేలు.

కునుకుపడుతూ వుంది. పక్కసందులోని ఒక బజారు కుక్క ఊర్ధ్వస్థాయిలో అరిచింది. వెంటనే దాని సైన్యమంతా అరవటం మొదలెట్టింది. ఆ సంగీతానికి శేషు తృళ్ళిపడ్డాడు. యెవడో దొంగవెధవను పసిగట్టి ఈ కుక్కలు మానవ సమాజానికి అలారంకొట్టి పుణ్యం కట్టుకుంటూన్నాయ్. ఆ దొంగ తన యింటివైపే వొస్తున్నాడేమో? ఆగి అన్నివైపులా బహు జాగర్తగా చూస్తున్నాడు. సరిగ్గా వలలోకి వచ్చాకనే కాని వాడి పనిపట్టకూడదు.

పది నిముషాలకల్లా కుక్కలు తమ ఖోరస్‌ను ఆపి సన్నని రాగాలాపనలతో క్రమంగా నిశ్శబ్దంలోకి జారినయ్. అరగంట గడిచినా దొంగలజాడ లేదు. అనవసరంగా తన వలను మళ్ళీ ముడుచుకోవాల్సి వొచ్చింది. వెధవ కుక్కలు పోలీసులకన్నా అన్యాయం! రోడ్డున పోయే ప్రతిమనిషినీ అనుమానించి అరుస్తయ్! వాటి సంగీతం వాటికే ఆనందం కాబోలు! ఒకనాటి రాత్రి మెయిల్ దిగొస్తుంటే తనంత పెద్దమనిషినే అనుమానించి మొరుగుతూ వెంటబడ్డయ్! వాటికి యుక్తాయుక్త విచక్షణ శూన్యం- అందుకనే వాటిని కుక్కలు అన్నారు. రకరకాల ఎంగిలికూడు తినటం అలవాటయ్యాక

వాటికి ఏ ఒక్క బుద్ధీ జీర్ణంకాదు. రకరకాల బుద్ధులు..... పిచ్చివాడి తలలోని ఆలోచనలకు తోడ్పడేలాటివి వంటపడతయ్. అదేకాదు యింకో కుక్కను చూసికూడా అన్నీ మొరగటం ఆరంభిస్తయ్. చుట్టుపట్లవాళ్ళకు నిద్రాభంగం అవుతుందనే జ్ఞానం కూడా లేకుండా తెల్లవార్లూ ఇలాగే గోలచేస్తుంటయ్.

కాని కుక్కల్ని ఒకందుకు మెచ్చుకోవాలి కూడాను. ఇలా గొంతు చించుకొని మొరగటంవల్ల దొంగలు భయపడకపోయినా (వాళ్ళకిది అలవాటే కనక!) తనలాగా ధైర్యంగా కాపలా కాచేవాళ్ళకి ఉపయోగం; కునుకుపట్టే సమయానికల్లా గోలచేసి పరాకు తెలుపుతూ వుంటయ్. ఇలాటి కుక్కలకు తోడుగా నల్లులూ, దోమలూ సమృద్ధిగా వుంటే వేరే చెప్పాలా?- గస్తీవాడు అతినమ్మకంగా పనిచేసే అవకాశం యెంతైనా వుంది.

యెందుకైనా మంచిది- ఆ వొచ్చే దొంగకు ఆయుధం వుండితీరుతుంది, ప్రమాదం సంభవించే అవకాశం వున్నదనే గట్టి నమ్మకం వాడికి వుంటుంది కనుక, తనకు సహాయంగా సిద్ధంగా ఆ ఆయుధాన్ని తెచ్చుకుంటాడు. అలాటి ఆయుధాలేమీ ప్రస్తుతం-యిప్పటికిప్పుడే తనకు దొరకవు. కనుక-కనీసం లభ్యమయేవాటిల్లో మంచి ఆయుధాన్ని దగ్గర వుంచుకోవటం అవసరం. కట్టిపేళ్ల గుట్టలోంచి మరీలావులేని ఒక సర్వీ కర్రను ఏరి మంచం ప్రక్కనే పెట్టుకున్నాడు.

ఎలాగైనా ఇంకొక్క మూడుగంటలు మేలుకుంటే తెల్లారిపోతుంది. ఇక్కణ్నుంచి కాస్త కష్టం. కాని ఇప్పుడు పడుకుంటే మాత్రం ఇంతవరకూ కష్టపడ్డదంతా వృథా!

కాకపోతే యీనిద్ర తీరిగ్గా రేపటి ఆదివారం పగల్లో ఖర్చుపెట్టవొచ్చు. కూర్చొని మేలుకోవటం మంచిది. కాని కూర్చుంటే నడుం నొప్పి పుడుతుంది. పడుకుంటే నిద్ర వొస్తుంది. యెలాగైనా మొండికేసి మేలుకోవాలి. ఎలాగూ నిద్రవుండదు కనుక, నడుం నొప్పి పట్టకుండానే నిద్ర దండగపడటం మంచిది.

ఆలోచనలన్నీ ఇప్పటికి యింకిపోవటంవల్ల నిద్రాదేవి రెప్పల మీద నాట్యం చేయనారంభించింది. మధ్యమధ్య తనకు తాను పరాకు తెలుపుకుంటూ కళ్లు సగం మాత్రం మూసుకున్నాడు. మిగతా సగమూ అవసరమైన వెంటనే తెరిచేందుకు!

కాని నిద్ర అనేది చెప్పిరాదు. నిద్ర పోదల్చుకున్నప్పుడు అది రాక పోవటమూ, మేలుకోవాలనుకున్నప్పుడు అది రావటమూ, కొత్తవింతేమీ కాదు. అందులోనూ ఆలోచనాభారంతో యెక్కువగా అలసిపోయిన శేషులాటివాణ్ని జయించటంలో నిద్రాదేవికి యెక్కువ శ్రమ కలగలేదు. ఆ చల్లగాలికి అతని కళ్లు క్రమంగా గట్టిగా మూతలు పడిపోయినయ్.

3

దగ్గర్లో, దగ్గర్లో ఏమిటీ– తన మంచంపక్కనే! యెవడో పెద్దయెద్దంత వాడు నల్లగా తుమ్మమొద్దల్లే ఆ చీకట్లో దాదాపు కలిసిపోతున్నాడు. లైటు ఆరిపోయి వుండడంవల్ల ముఖకళ అంత స్పష్టంగా కనిపించకపోయినా మిణుగురు పురుగులల్లే క్రూరత్వంతో మెరిసే వాడి కళ్ళు భయంకరంగా వున్నయ్. వాడి శరీరం నిగనిగలాడుతోంది. బహుశా పట్టుకుంటే జారిపొయ్యేందుకు వీలుగా ఆముదమో లేక అలాటి జిగటపదార్థమో పట్టించి వుంటాడు. మోకాళ్ళపైకి పంచను ఎగకట్టాడు. అవసరమైతే మైలు రేసుకు సిద్ధంగా వుండేందుకు.... ఒక్క మాటలో వాడు శేషు ఊహాచిత్రంలోని దొంగకు సరిపోలుతాడు.

వాడు ఆ నీచుడు. తన భార్యతో పోట్లాడుతున్నాడు. బలిష్ఠమైన వాడి చెయ్యి ఆమె మెడలోని గొలుసు మీద వుంది. ఆమె తన రెండు చేతులతోనూ పెనుగులాడుతూ వుంటే వాడు గొలుసును వొదలకుండానే ఒక్క చేతితోనే అందుకుంటున్నాడు. ఆమె బాగా అలిసిపోయినట్టు గట్టిగా ఊపిరి వొదుల్తోంది. గాఢ నిద్రలో వుండగా హఠాత్తుగా ఇలా వొచ్చిపడితే యెవరికైనా కష్టమే!

ఆమె "లేవండీ– దొంగండీ!" అంటూ వుంది.

నిజంగా తనులేచి కలియబడాల్సిన సమయం. ఆమె దొంగను కొంతవరకూ అలిసేట్టుచేసి తనకు కొంత పనిని తగ్గించింది. వాడుమాత్రం నిర్భయంగా యెవరు వచ్చినా తననేమీ చెయ్యలేరన్న ధీమాతో పెనుగులాడుతూనే వున్నాడు.

తనులేచి వాడి మీదికి దూకాలనే మాట బుర్రలో మెరవగానే శేషు ధైర్యం నీళ్లు కారిపోయింది. ఆ భయంతో అతనికి ముచ్చెమటలు పోసినయ్... బంగారు ఆభరణాలు పురుషులు ధరించే ఆచారం అంతగా లేకపోవడం ఒక విధంగా మంచిదే! లేకుంటే ఇప్పుడు తన భార్య స్థానంలో తను వుండేవాడు. ఛీ! ఎంతో ధైర్యసాహసాలని ప్రదర్శించాలని నిశ్చయించుకున్న తనలాటి నవయువకుడు ఇలా పిరికి పడిపోవటమేమిటీ?

లేద్దామని చూస్తుండగా, దొంగబొడ్డులో మెరిసే బాకు కనిపించింది. వెంటనే ఈ దుర్ఘటనను మరిచిపోదామని గట్టిగా కళ్లుమూసుకొన్నాడు. తనిప్పుడు లేవటం ఒకవిధంగా చెరుపుకూడాను. ఇక లాభంలేదని వాడు ఆ బాకుకు పని కలిగించవొచ్చు. ఆ తొందర్లో అది తన ప్రాణానికే ముప్పు ఐతే–? తన విలువైన ప్రాణాన్ని ఈ వెధవ గొలుసుకోసం బలిపెట్టాల్సి వొస్తుంది. బతికిబాగుంటే మళ్ళీ సంపాయించుకోవచ్చు. బాకు ఏ పొట్టలోనో, ఏ కంఠంలోనో లోతుగా గుచ్చుకుంటే–పాతాళగంగ పైకి దూకుతూన్నట్టుగా బొళబొళా కారే రక్తానికే తనకళ్లు గిర్రునతిరుగుతయ్. ఏ గొలుసు

కోసం ఆ దొంగ ఎంత ఘోరాన్నయినా చేసేందుకు సిద్ధంగా వున్నాడో ఆ గొలుసు వాడిమొహాన విసిరిపారేస్తే (అప్పుడు వాడికి పెద్దదెబ్బ తగలకూడదు, తాము ఆ గొలుసు యెంత చిన్నచూపుగా చూస్తున్నారో వాడికి అర్థమయేట్టు చేస్తే చాలు) యీపీడ వొదుల్తుంది. అలాగు కళ్లుమూసుకొని "వెధవగొలుసు - యిచ్చెయ్!" అని భార్యను పురమాయిద్దా మనుకున్నాడు, కాని తను మాట్లాడటం మొదలుపెడితే - నిద్రపోతున్నవాళ్ళు మాట్లాడరని దృఢంగా తెలిసిన దొంగ యువకుడైన తనవల్ల హానికలగకుండా వుండేందుకు ఏదో వొక అఘాయిత్యం చెయ్యవచ్చు. లేక, ఇంత పిరికి పడిపోవటం వాడికి కొత్తధైర్యాన్ని ఇస్తుంది. అప్పుడు వాడు మిగిలిన వస్తువుల కోసం చీకటి రాత్రుల్లో అప్పుడప్పుడు విధిగా దర్శిస్తూ ఉండటం తనకు అంత క్షేమకరంకూడా కాదు. లేక మళ్ళీమళ్ళీ వొచ్చే శ్రమను తగ్గించుకునేందుకు మిగిలినవాటిని కూడా వెంటనేమూటకట్టి ఇప్పుడే తనకు ఇమ్మని బాకు చూపుతూ భయపెట్టి - ఇకముందు రాత్రుల్లో వాడి భయం తమకు మరి లేకుండా చేసినా చెయ్యవొచ్చు.... ఏమైతేనేం ఈ రాత్రి తననిండు ప్రాణాన్ని (తనకు ఇంతవరకూ అర్థప్రాణాలూ పావుప్రాణాలూ తోడుగా లేకపోవటం ఒక అదృష్టం! వాటికోసం తనభార్య బాధపడుతూండటంలోని మౌఢ్యాన్ని రేపు యీదృశ్యాన్ని ఆధారం చేసుకుని బాగా అర్థమయేట్టు చెప్పవొచ్చు!) లేక తననిండు ప్రాణంలోని ఏ కొద్దిభాగాన్నీ ఇప్పుడు రిస్క్ చేయదలచలేదు .... కాకపోతే ఆ ప్రాణాన్ని-వీడు కాకపోతే వీడి తరువాతవొచ్చే వాడికోసం భద్రంగా దాచి, అప్పుడు వాడిపని పట్టి, వీడి నేరాన్ని కూడా వాడిమీద రుద్ది-మొత్తం శిక్షనంతా వాడికేవేస్తే సరిపోతుంది. ఒకపార్టీలోవాడు తినే దెబ్బ - పార్టీకంతకూ తగుల్తుందనే సిద్ధాంతంలోని సత్యాన్ని యీ విధంగా రూపించవొచ్చు.

భార్య ఇంకా పెనుగులాడుతూనే వుంది. తను లేచి "దొంగలు! దొంగలు!" అని కేకలేస్తే! ఇది బాగానేవుంది. కాని అతనికి నోరాడలేదు. గొంతంతా యెండిపోతున్నట్టనిపించింది. తను నిజంగానే మృత్యు కుహరంలోకి జొరబడుతూన్నట్లు తోచింది.

ఒక దొంగతో పోట్లాడాల్సి వస్తుందేమోనని ఏరి తెచ్చుకున్న సర్వీకఱ్ఱ జ్ఞాపకం వచ్చింది. అది యీ సమయంలో తనకు సహాయపడగలదు. కాని ఇలాటి పోట్లాటలు తనకు మరీ కొత్తమేళం. కఱ్ఱపట్టునేందుకు చేతులు ఒణుకుతున్నయ్. తన కఱ్ఱను చూసి దొంగ కత్తిని బైటికి తీయవొచ్చు. కఱ్ఱకన్న కత్తి పదునైందని తనకు తెలుసు. యీ సందర్భంలో ప్రవేశం ఏమీలేని వ్యవహారంలో జోక్యం కలిగించుకోవటంకన్నా- బుద్ధిశాలి లక్షణం ఏమిటంటే, కిమ్మనకుండా ఊరుకోవటం!

ఆమె ఇలా ఇంకెంతసేపు పెనుగులాడుతుందీ? తనను నిద్రలేపేందుకు ఇంకా ప్రయత్నిస్తూనే వుంది. తనకు మెళుకువ వచ్చింది కాని మేలుకొనే వున్నట్టు సూచించేందుకు వీల్లేని సంఘటనాయె! మేలుకున్నవాణ్ని నిద్రలేపేందుకుచేసే ప్రయత్నం

వ్యర్థం! అసలు తను మేలుకొనే వున్నట్టు దొంగకు కాకుండా ఆమె ఒక్కతెకే తెలిసే సూక్ష్మమార్గం ఏదైనా వుంటే యెంత బాగుండేదీ!

ఇలాగే తెల్లవారేదాకా పెనుగులాడి దొంగను పట్టించేందుకు ఆమె తెలివిగా ఆలోచించివుంటుందా? ఇది మంచిపద్ధతేకాని, తెల్లవార్లూ పోట్లాడటం కష్టం. అదీకాక తనకన్న తొందరగానే యీ వ్యవహారాన్ని పైసలు చేసుకొని కాళ్ళకు బుద్ధిచెప్పితీరాల్సిన తన బాధ్యతను దొంగ యేవిధంగానూ మరిచిపోలేదు.

తనకు యింకే దారీ కనిపించటం లేదు ... ఒక ప్రేక్షకుడిగా మాత్రమే ఉండిపొయ్యాడు.

హఠాత్తుగా దొంగ పెద్దకేక పెట్టాడు. విషయాన్ని తెలుసుకునేందుకు శేషుకు యెక్కువసేపు పట్టలేదు.

ఆమె వాడి చేతి మీద గట్టిగా కొరికింది. గట్టిగా ... అంటే, కండకండా వూడివొచ్చింది. అంత బలిష్ఠకాయుడూ ఎగిరి గంతేసి బాధతో కేకవేశాడు. కేక పెద్దదవటంవల్ల, ఇరుగుపొరుగుల్ని అనవసరంగా ఆహ్వానించటానికి ఎంతైనా వుపయోగపడుతుందని వెంటనే గ్రహించి, తెలివిగా బాధతో మూలుగుతూ పరుగెత్తసాగాడు. శేషుహృదయం ఆనందంతో పొంగిపోయింది. నిజంగా తన భార్యకు సన్మానసభ నొకదాన్ని ఏర్పాటుచేసి, వీరనారీమణుల లిస్టులో ఆమె పేరు కూడా జేర్పించి తీరాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి.

...యీ వెధవ పీడకల నుంచి ఇప్పుడే మెళుకూ వొచ్చి "వెధవ దొంగలు! బోడిదొంగలు!" అంటూ తృళ్ళిపడిలేచాడు. అందులోనూ మలయమారుతం వీచే యీ తెల్లవారుజామున యీ పీడకలేమిటీ? భార్యను లేపి అదంతా చెప్పెయ్యాలనుకున్నాడు. ఇప్పటికిగాని అతని గుండెదడ బాగా తగ్గలేదు.

ఆమె మేలుకునేవుంది.... తన కలను వినేందుకు సిద్ధంగా ఉన్నట్టు!

"వెధవ కల! బోడికల!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. శేషు చెప్పుకుపోవటం మొదలుపెట్టాడు. ఆమె అంతావిని హేళనగా నవ్వుతూ "దొంగలు పడ్డ ఆరు నెల్లకు కుక్కలు మొరిగినయ్యట! దొంగ నిజంగానే రావటమూ, మీరు చెప్పిన సంఘటన అంతా మీ కళ్లముందు జరిగితే– అదంతా కలనటం– ఏం తెలివితేటలండీ!" అంది.

"నిజంగానే వొచ్చాడా?"

"కాక? నేను వాడితో అరగంటసేపు పెనుగులాడాను. మెడంతా ఒరుసుకు పోయింది. మిమ్మల్ని లేపుతే ఎంతకూ లేవరాయె! చివరకు నా కేమీ తోచక కండకూడా ఊడివచ్చేటంత బలంగా వాడి చెయ్యి కొరికాను–"

శేషు అనుమానం తీరక లైటు వేసి చూశాడు. పక్కంతా తడిఆరని రక్తంతో తడిసివుంది.

"కండ ఏదీ?" అన్నాడు.

"అది వాడిచేతినే వుండిపోయింది. వాడిజన్మంతా గుర్తు వుంటుంది!"

పోట్లాటలో అలసిపోయిన ఆమె మూర్తి, ఫాలభాగంమీది శ్వేతబిందువులూ, మెడమీదపడ్డ గాట్లూ- ఇదంతా కల ఎలాగవుతుందీ?

"వాడితో- అంత బలమైనవాడితో పెనుగులాడావుటే? భయం వెయ్యలా?"

"భయమేముందీ? మీరు పక్కనే ఉన్నారని ధైర్యంగానే వుంది. మేలుకునే ఇదంతా చూస్తూ ఊరుకున్నారేం?"

"వాడి బొడ్డులో కత్తి వుంది..... అది చూశాకన్నా భయం వెయ్యలా?"

"భయం! దూరంగా వున్న మీకు భయం! నిజంగా సంఘటనలో పాత్ర తీసుకున్నాక- భయంలోకే దూకాక ఇంకా భయంవేరే ఎక్కణ్ణుంచి వొస్తుందీ? మొదట్నే వాడి బొడ్డులోని కత్తిని చూసినట్టయితే అదిలాగి వాణ్ణే పొడిచిపారేసేదాన్ని!"

"ఎంత గుండెనిబ్బరమే!"

"అందరి ధైర్యాలూ మీలాగే వుంటయ్యనుకోకండి. వాణ్ని మంచి ఆయుధంతోనే ఎదుర్కొన్నాను!"

"వెధవను యీసారి రానీ!"

"ఈసారికూడా హాయిగా కలగంటూ పడుకుందురుగాని. ఐనా ఆరునెల్ల లోపల మాత్రం వాడిటురాడు. అంతకు తక్కువకాలంలో వాడి చెయ్యి బాగుపడదు. యీ సంగతి మిగతా సజ్జుకుకూడా చెప్తాడు. వాళ్లక్కూడా చేతులంటూ ఉంటాయ్ కనుక వాళ్లుకూడా యిటువైపు రారు."

"నాకొక ఆలోచన తట్టింది. రేపే వాణ్ని పట్టుకుందాం!"

"ఎట్లా?"

"వాడు కట్టుకట్టించుకునేందుకు రేపు ఏ ఆసుపత్రికన్నా రాకమానడు. వెంటనే వాణ్ని పట్టేసి నీపళ్లగాట్లను సరిపోల్చి, జైలుకు పంపిస్తాను."

"గొప్ప పని చేస్తారు! ఇక్కడికి వచ్చినప్పుడు నేను ఒక్కతెనూ చస్తూంటే మాట్లాడకుండా ఊరుకున్నారు కాని రేపు యెప్పుడో ప్రతి ఆసుపత్రి దగ్గరా, ప్రతి డాక్టరు దగ్గరా కాపలావేసి పట్టుకొందురుకాని! భలే" అని నవ్వసాగింది.

శేషు నిరుత్సాహపడి, తన ఓటమికి బాధపడుతూ, వెంటనే ఆలోచన రాగా అన్నాడు: "అసలు నేను మొదటనే చెప్పాను. ఈ శ్రమా, ఈ ప్రాణాపాయాలూ యివేమీ

లేకుండా ఇంట్లోనే పడుకుందామన్నాను. నువ్వు వినలేదు. కనీసం ఆ గొలుసు తీసెయ్యమన్నా మాట పెడచెవిని పెట్టావ్. మాట విననందుకు అనుభవించావు....నేను కల అనుకున్నాను కాని లేకపోతే– ఇక్కడ సర్వీకర్ర కూడా సిద్ధంగావుంచాను. దీనితో వాడికి కపాలమోక్షాన్ని ప్రసాదించేవాణ్ణి–"

"ఈసారి వచ్చినప్పుడా?" అని నవ్విందామె.

"పోనీ.....నాకు ధైర్యంలేదనే అనుకో. ఐతే మాత్రమేం? నాకు తెలివి తేటలూ, విజ్ఞానమూ సకారణ వాదనా వుంది. అందుకనే అసలు ప్రమాదాల్లోకి పోకుండానే కాపాడుకోగలను. ధైర్యం అంటూ ఉండగానే సరా? ఆ నమ్మకంతో ఇలాటి అనవసరమైన ప్రాణాపాయాల్ని యెదుర్కోవాల్సి వొస్తుంది. అందుకనే–"

"పోనీండి....మీరు మహాబుద్ధిశాలురు! కాస్సేపు పడుకొని అలసట తీర్చుకోండి" అందామె.

శేషుకు జవాబేమీ దొరక్కపోగా తన బుద్ధివిశేషాన్ని భార్య యెందుకు గ్రహించలేదో అర్థమవలేదు.

– జూన్ *1947*